## నేడు మహబూబ్‌నగర్, దేవరకద్రలో
# మల్లన్న పర్యటన



- టీఆర్పీ జెండా ఆవిష్కరణ, కార్ ర్యాలీ
- అనంతరం బహిరంగ సభలో పాల్గొననున్న పార్టీ అధినేత
- హాజరుకానున్న టీఆర్పీ రాష్ట్ర నాయకులు
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన పార్టీ శ్రేణులు
- కార్యకర్తలు, అభిమానులకు పెద్ద సఖ్యలో తరలి రావాలని పిలుపు

2


శనార్తి
# తెలంగాణ
telanganarajyadhikaraparty.in

సంపుటి : 05 | సంచిక : 336 (కాంప్లిమెంటరీ కాపీ) | ఎడిటర్ : తీన్మార్ మల్లన్న | బుధవారం 29-07-2026 | పేజీలు : 2



# మల్లన్నను ఆపేదెలా..!?

## పాదయాత్ర చేస్తే మన పరిస్థితేంటి..!?

### టెన్షన్‌లో రెడ్లు, వెలమ నాయకత్వం..!?

- అగ్రవర్ణాల్లో గుబులు పుట్టించిన భువనగిరి రాజ్యాధికార సభ..!
- ఇక పాదయాత్ర మొదలైతే బీసీల సంఘటితం తప్పదనే ఆందోళన..!
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను బాగా ఆకట్టుకుంటున్న మల్లన్న వాయిస్..!
- ఇదే వాయిస్ పాదయాత్ర ద్వారా ఎక్కడ ప్రతీ ఇంటికి చేరుతుందోననే టెన్షన్..!
- అందుకే మల్లన్న పాదయాత్రకు అడ్డంకులు సృష్టించేందుకు తెర వెనుక అగ్రవర్ణాల కుట్రలు..!?

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్:**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కమ్మ, రెడ్ల రాజకీయం కొనసాగితే.. ఇక తెలంగాణ వచ్చాక రెడ్లు, వెలమల రాజకీయం పదిలమైపోయింది. సమైక్యాంధ్రలో రెండున్నర జిల్లాలు, రెండు కులాలదే ఆధిపత్యమైతే తెలంగాణలో వెలమ, రెడ్లే అధికారాన్ని పదిలం చేసుకున్నారు. ఏపీ దోపిడి పీడన నుంచి విముక్తి కోసం సబ్బండ కులాలు పోరాటం చేస్తే.. రాష్ట్రం ఏర్పాటు తర్వాత మాత్రం రాజ్యాధికారం వెలమ, రెడ్ల వశమైపోయింది. ఈ పరిస్థితులను మార్చేందుకే టీఆర్పీ చీఫ్, శాసన మండలి సభ్యులు తీన్మార్ మల్లన్న బయలుదేరడాన్ని రెడ్లు, వెలమలు అస్సలు జీర్ణించుకోలేకపోతున్నారు. మల్లన్న టీఆర్పీ పార్టీ స్థాపన తర్వాత బీసీల్లో గణనీయమైన చైతన్యమొచ్చింది. అనాదిగా బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని పూసగుచ్చినట్లు వివరించడంలో మల్లన్న బాగా సక్సెస్ కాగల్గారు. కుల గణన సర్వే రిపోర్ట్‌ను తగులబెట్టడడం నుంచి ఆ లెక్కలను రాష్ట్ర ప్రభుత్వం బహిర్గతం చేసేదాక మల్లన్న పట్టు వీడవకపోవడం రెడ్లు, వెలమలను ఒకింత టెన్షన్ గురి చేసింది. ఇక భువనగిరి రాజ్యాధికార సభ సక్సెస్ తర్వాత వెలమ, రెడ్డి నాయకుల ముఖాలు పూర్తిగా వాడిపోయాయి.
ఇక ఇప్పుడు మల్లన్న సెప్టెంబర్ 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపడుతానని ప్రకటించారు. ఇందుకోసం సమస్త బీసీ సమాజం, సబ్బండ బీసీ కులాలు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కమ్మ, రెడ్ల రాజకీయం కొనసాగితే, తెలంగాణలో వెలమ, రెడ్ల పొలిటికల్ ఆజామాయిషిని మల్లన్న తూర్పారపట్టేందుకు సిద్ధమవుతున్నారు. బీసీ సమాజాన్ని చైతన్యం చేసేందుకు ప్రతి గడపకూ వెళ్లేందుకు రెడీ అవుతున్నారు. వాస్తవానికి మల్లన్న ఏదైనా అంశం మీద మాట్లాడితే ఆ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యే భాష, మాండలికంలో వివరించడంలో దిట్ట. ఇదే ఇతర బీసీ నేతల కన్న ప్రజల్లో మల్లన్నకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది. ఇతర బీసీ నాయకులు ఏనాడు తమ వర్గాలకు ఎవరి వల్ల నష్టం జరుగుతుందో ప్రజలకు బలీయంగా వివరించే ప్రయత్నాలు చేయలేదు. బీసీ సమస్యలపై వారు రౌండ్ టేబుల్ సమావేశాలు, అప్పుడో ఇప్పుడో ఇందిరా పార్క్ వద్ద ధర్నాల వరకే పరిమితమయ్యారు. ఒకవేళ ఏదైనా సభలు, సమావేశాలు పెట్టినా తరువాయి 2లో...



# లీక్‌లపై ఉక్కుపాదం..!

## రూ.10 కోట్ల వరకు జరిమానా..!

### పేపర్ లీక్ నిరోధక బిల్లుపై లోక్‌సభలో కీలక చర్చ..!

**పరిశీలన, ఆమోదం కోసం బిల్లును సభలో ప్రవేశపెట్టిన జితేంద్ర సింగ్..!**

### లాఠీచార్జ్‌పై ప్రియాంక మండిపాటు..!

**సభలో మోదీ, షా లేకపోవడంపై కాంగ్రెస్ అభ్యంతరం..!**

**బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని ఆర్ఎస్పీ ఎంపీ ఎన్.కే. ప్రేమచంద్రన్ పట్టు..!**

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:**
వారం రోజులుగా కొనసాగిన ప్రతిష్ఠంభనకు తెరపడడంతో లోక్‌సభలో పబ్లిక్ ఎగ్జామినేషన్ అమెండ్‌మెంట్ బిల్లు-2026పై విస్తృత చర్చ ప్రారంభమైంది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఈ బిల్లును పరిశీలన, ఆమోదం కోసం మంగళవారం సభలో ప్రవేశపెట్టారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించేందుకు, పేపర్ లీక్‌లకు పాల్పడే వ్యక్తులు, సంస్థలు, ముఠాలపై మరింత కఠిన చర్యలు తీసుకునేందుకు ఈ సవరణలు తీసుకొస్తున్నామని తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారికి గరిష్ఠంగా రూ.10 కోట్ల వరకు జరిమానాతో పాటు కఠిన జైలు శిక్షలు విధించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం వెల్లడించింది. ఇదే సమయంలో విద్యార్థి నిరసనలపై పోలీసుల లాఠీచార్జ్, పెలెట్ గన్స్, టియర్ గ్యాస్ వినియోగంపై దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇంత కీలకమైన బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో లేకపోవడంపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల విజ్ఞప్తి మేరకు బిల్లుపై చర్చ సమయాన్ని అవసరమైతే 10 గంటల వరకు పొడిగించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. మరోవైపు బిల్లును మరింత లోతుగా పరిశీలించేందుకు సెలెక్ట్ కమిటీకి పంపి ప్రజాప్రతినిధులు, సంబంధిత వర్గాల అభిప్రాయాలు తీసుకోవాలని ఆర్ఎస్పీ ఎంపీ ఎన్.కే. ప్రేమచంద్రన్ డిమాండ్ చేశారు.



## భాగ్యనగరంలో భారీ వర్షం..!

- ఉరుములు, మెరుపులతో బీభత్సం
- రోడ్లపై నిలిచిన వర్షపు నీరు
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు
- తీవ్ర ఇబ్బందులు పడ్డ వాహనదారులు
- సహాయక చర్యలు చేపట్టిన జీహెచ్ఎంసి సిబ్బంది
- అవసరమైతే తప్ప ప్రజలు బయటికి రావద్దని హెచ్చరిక



2



## జపాన్‌లో భారీ భూ కంపం

- రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.1గా నమోదు
- సముద్ర మట్టానికి 10 కిలో మీటర్ల లోతులో భూ కంప కేంద్రం గుర్తింపు
- నాగసాకి, కగోషియా, సాగా, ఓయిటా, మియాజు ప్రాంతాలపై ఎర్త్‌క్విక్ ప్రభావం

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** జపాన్‌లోని దక్షిణ క్యుషూ ద్వీపంలోని కుమమోటో ప్రాంతాన్ని మంగళవారం భారీ భూకంపం వణికించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 7.1గా నమోదుకాగా, భూకంప కేంద్రాన్ని సముద్ర మట్టానికి 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. నాగసాకి, కగోషిమా, సాగా, ఓయిటా, మియాజాకి సహా పలు ప్రాంతాల్లో తీవ్ర ప్రకంపనలు నమోదయ్యాయి. భూకంపం కారణంగా రహదారులు దెబ్బతినగా, కొన్ని భవనాలు కూలిపోయాయి. కుమమోటోలోని ఓ షాపింగ్ మాల్‌లో పేలుడు సంభవించి భవనం పాక్షికంగా తరువాయి 2లో...

### హైకోర్టు తీర్పు రేవంత్‌కు చెంపపెట్టులాంటిది

- హైడ్రాను అడ్డం పెట్టుకొని రేవంత్ దందాలు చేస్తున్నారు
- హైడ్రా ఓ బ్లాక్ మెయిల్ సంస్థ
- మేం అధికారంలోకి వచ్చాక దాన్ని రద్దు చేస్తాం
- రంగనాథ్‌ను తప్పించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2



2

### జూరాలకు పోటెత్తిన వరద.!

**ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల ఎత్తివేత.!**

### 18 ఏళ్లలోపు పిల్లలను వదిలేయండి

- క్రైం రికార్డు లేనివారిని విడుదల చేయాలి
- నేర చరిత్ర ఉంటే మినహాయింపు ఇవ్వలేం
- అలాంటి వారికి రక్షణ కల్పించలేం
- సీజేపీ నిరసనలు, ఆందోళనలపై నమోదు అవుతున్న కేసులపై సుప్రీం కీలక ఆదేశాలు



2



## నేడు మహబూబ్‌నగర్, దేవరకద్రలో
# మల్లన్న పర్యటన

**శనార్తి తెలంగాణ,మహబూబ్‌నగర్:** తెలంగాణ రాజ్యాధికార పార్టీకి రోజురోజుకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు నాయకులు టీఆర్పీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారు. బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నారు. ఈ తరుణంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నేడు (జూలై 29, 2026) మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనలో భాగంగా దేవరకద్రలో నిర్వహించే బహిరంగ సభకు హాజరు కానున్నారు. ముందుగా మహబూబ్‌నగర్ పట్టణంలోనీ ఏనుగొండ 2వ వార్డులో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండాను ఆవిష్కరించనున్నారు. అనంతరం అక్కడి నుంచి పాలమూరు యూనివర్సిటీ వరకు భారీ కార్ ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీ అనంతరం నేరుగా దేవరకద్రకు చేరుకుని బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ ప్రాముఖ్యతను, అగ్ర వర్ణాల దౌర్జన్యాలను ప్రజలకు వివరించనున్నారు. ఈ పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఈ కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు, బీసీ సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.

# 18 ఏళ్లలోపు పిల్లలను వదిలేయండి

- క్రైం రికార్డు లేనివారిని విడుదల చేయాలి
- నేర చరిత్ర ఉంటే మినహాయింపు ఇవ్వలేం
- అలాంటి వారికి రక్షణ కల్పించలేం
- సీజేపీ నిరసనలు, ఆందోళనలపై నమోదు అవుతున్న కేసులపై సుప్రీం కీలక ఆదేశాలు
- అన్ని రాష్ట్రాలు తమ ఆదేశాలను వెంటనే అమలు చేయాలి
- జంతర్ మంతర్ ఘటనపై సిట్ ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడి

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు మేరకు జంతర్ మంతర్ సహా దేశవ్యాప్తంగా జరిగిన నిరసనలకు సంబంధించిన వ్యవహారంపై ఢిల్లీ సహా, వివిధ రాష్ట్రాల్లో నమోదైన కేసులపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆందోళనల్లో పాల్గొన్న వారిలో 18 ఏళ్లలోపు పిల్లలు, అలాగే ఎలాంటి కేసులు, క్రైం రికార్డ్ లేని వ్యక్తులను వెంటనే విడుదల చేయాలని తెలిపింది. ఈ అంశంపై దాఖలైన అన్ని పిటిషన్లను మంగళవారం సర్వోన్నత న్యాయస్థానం అత్యవసరంగా విచారణకు చేపట్టి అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. తాము ఇచ్చిన ఆదేశాలను వెంటనే అమలు చేయాలని స్పష్టం చేసింది. గతంలో నేర చరిత్ర ఉన్నవారికి అరెస్టుల నుంచి మినహాయింపులు ఇవ్వలేమని తెలిపింది. అలాంటి వారికి రక్షణ కల్పించడం సరికాదని అభిప్రాయపడింది. జంతర్ మంతర్ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు కోసం సిట్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించనున్నట్లు వెల్లడించింది. నిరసనలకు సంబంధించిన వీడియో, సీసీటీవీ ఫుటేజ్, ఇతరత్రా ఆధారాలను పోలీసులు భద్రపర్చాలని సూచించింది. ఆ ఆధారాలు తాము వేయనున్న ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణకు ఉపయోగపడుతానని వివరించింది.

# ప్రజలు మార్పు కోరుతున్నారు

## బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్ రావు



**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ నేతృత్వంలో 'డబుల్ ఇంజిన్ సర్కార్' ఏర్పాటు కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దక్షిణ తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం కావడం శుభపరిణామమని, మేధావులు పెద్ద సంఖ్యలో పార్టీలోకి చేరుతుండటం మార్పుకు సంకేతమని అన్నారు. ప్రస్తుతం దేశంలో యువత ఉద్యమాల ముసుగులో విదేశీ నిధులు సేకరిస్తూ దేశాన్ని విభజించేందుకు కొన్ని కుట్రలు సాగుతున్నాయని, దేశ సమగ్రతను కాపాడుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా ఉండాలన్నారు. సనాతన ధర్మాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అనేక దేశాలు క్రిస్టియన్, ముస్లిం దేశాలుగా మారినా సనాతన ధర్మాన్ని ఏ శక్తీ నిర్మూలించలేకపోయిందని అన్నారు.
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. ఇది ప్రతి పదేళ్లకు ఒకసారి సాధారణంగా జరిగే ప్రక్రియ మాత్రమేనని, దీనిని అడ్డుపెట్టుకుని అనవసర భయాందోళనలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. దేశ భద్రత,సమగ్రత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని రామచందర్ రావు స్పష్టం చేశారు.

# మల్లన్నను ఆపేదెలా..!?

మొదటిపేజీ తరువాయి...

ఆ కార్యక్రమాలకు రెడ్డి, వెలమ, కమ్మ నేతలనే చీఫ్ గెస్ట్‌లుగా పిలిచిన సందర్భాలు అనేకం. అందుకే ఇలాంటి బీసీ నాయకుల వల్ల ఏనాడు రెడ్లు, వెలమలు పెద్దగా ఆందోళనకు గురికాలేదు. కానీ, టీఆర్పీ చీఫ్ తీన్మార్ మల్లన్న మాత్రం మిగతా వారికి భిన్నమైన పంథాను ఎంచుకొని ముందుకు పోతుండడమే రెడ్లు, వెలమలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఇన్నాళ్లు బీసీలకు ఓ పార్టీ అంటూ లేనందువల్ల వారంతా రాష్ట్రంలోని ప్రధాన అగ్రవర్ణాల పార్టీల పంచనే ఉండేటోళ్లు. కానీ, మల్లన్న టీఆర్పీ స్థాపించిన తర్వాత పరిస్థితులు మారాయి. అన్ని పార్టీలకు సంబంధించిన మెజార్టీ బీసీ నాయకులు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరేందుకు క్యూ కడుతున్నారు. ఇప్పటికే వారికి నచ్చజెప్పలేక ప్రధాన పార్టీల నాయకత్వాలు సతమతమవుతున్నాయి. అలాంటిది ఈ సమయంలో మల్లన్న బీసీ సమాజ చైతన్యం కోసం పాదయాత్ర చేపట్టేందుకు సిద్ధమవుతుండడంపై రెడ్లు, వెలమలను ఆందోళనకు గురి చేస్తోంది. ఇప్పటికే కుల సర్వేపై మల్లన్న చేసిన రచ్చ కాంగ్రెస్ సర్కార్ ఇజ్జత్ తీసినట్లైంది. ఇక భువనగిరి సభ ద్వారా బీసీ నినాదం, వాయిస్‌ను మల్లన్న ప్రజల్లోకి బలీయంగా తీసుకెళ్లగల్గారు. అలాంటిది ఈ సమయంలో మల్లన్న కనుక తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేస్తే ఎక్కడ తమ వర్గాల రాజకీయ పీఠాలు కదిలిపోతాయోననే బెంగ రెడ్లు, వెలమలను వెంటాడుతోంది. అందుకే మల్లన్న బీసీ ఉద్యమం ముందుకెళ్లకుండా అడ్డుకోవడంపై రెడ్లు, వెలమ నాయకత్వాలు దృష్టి పెట్టినట్లు సమాచారం. ఆ దిశగా ఈ రెండు కుల నాయకత్వాలు ఒక్కటై మల్లన్న పాదయాత్రకు ఆటంకాలు సృష్టించడం ద్వారా బీసీ రాజ్యాధికార ఉద్యమాన్ని నీరుగార్చాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. అందుకోసం అవసరమైన అన్ని రకాల ఎత్తుగడలు, ప్రణాళికలను ఆయా వర్గాల నేతలు సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. అందుకే ఈ టైంలో బీసీ సమాజం... బీసీ యువత జాగ్రత్తగా ఉండాలని చెబుతోంది బీసీ మేధావి వర్గం.





# భాగ్యనగరంలో భారీ వర్షం..!

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** భాగ్యనగరాన్ని భారీ వర్షం ముంచెత్తింది. మంగళవారం సాయంత్రం కురిసిన వాన హైదరాబాద్ ను అతలాకుతలం చేసింది. మధ్యాహ్నం నుంచి ఆకాశం పూర్తిగా మేఘావృతం కాగా ఒక్కసారిగా వర్షం మొదలైంది. మొదట రాజేంద్ర నగర్‌లో ప్రారంభమైన వాన క్రమంగా నగరమంతా విస్తరిస్తూ వచ్చింది. ముషీరాబాద్‌లో అత్యధికంగా 31 మిల్లీమీటర్ల వర్షం కురిసింది నగరంలోని పలు ప్రాంతాల్లో కూడా ఏకధాటిగా కురిసిన కుండపోత వానకు రహదారులన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో ప్రధాన కూడళ్లలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించింది. వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ద్విచక్ర వాహనదారులు వర్షంలో తడుస్తూ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఇబ్బందిపడ్డారు. ముఖ్యంగా కార్యాలయాల పనివేళలు ముగిసే సమయం కావడంతో హైటెక్ సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. మియాపూర్, కూకట్‌పల్లి, రాయదుర్గం, మణికొండ, యూసుఫ్‌గూడ, ఖైరతాబాద్, కోఠి, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్ సహా నగరంలోని పలు ప్రాంతాల్లోపై వర్షం ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ క్రమంలో జిహెచ్ఎంసి సిబ్బందితో పాటు.. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పోలీసులు రంగంలోకి దిగి కీలక జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అదే సమయంలో హైడ్రా బృందాలు రహదారులపై నిలిచిన నీటిని తొలగించే పనులను చేపట్టారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలెవరూ బయటికి రావద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# హైకోర్టు తీర్పు రేవంత్‌కు చెంపపెట్టులాంటిది

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** హైడ్రా వ్యవహారంపై హైకోర్టు ఇచ్చిన తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టులాంటిదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైడ్రాను అడ్డం పెట్టుకొని రేవంత్ రెడ్డి దందాలు చేస్తున్నారని విమర్శించారు. హైడ్రా ప్రజల ఆస్తులను కాపాడే సంస్థ కాదని, అదో బ్లాక్‌మెయిల్ చేసే సంస్థగా మారిందని ఆరోపించారు. మంగళవారం కేటీఆర్ హస్తిన పర్యటనలో బిజీబిజీగా గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తప్పించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. హైడ్రా కమిషనర్ ముసుగులో అధికార దుర్వినియోగంపై న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ వైఖరిని బట్టబయలు చేశాయన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే హైడ్రాను పూర్తిగా రద్దు చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు కోరినట్లు తెలిపారు. మనోహరాబాద్–సిరిసిల్ల–కొత్తపల్లి రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని అభ్యర్థించినట్లు వెల్లడించారు.



# కొత్త విద్యాశాఖ మంత్రి రేపిస్టుల మద్దతుదారుడు..!

- గతంలో బిల్కిస్ బానో కేసు దోషుల విడుదలను సమర్థించారు
- ప్రహ్లాద్ జోషిపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు..!
- అలాంటి వ్యక్తి కీలకమైన విద్యాశాఖను ఎలా అప్పగిస్తారు..?
- క్యాబినెట్‌లో ఇతర సమర్థులైన మంత్రులు ఉన్నారు
- ప్రధాని మోడీ నిర్ణయంపై విమర్శలు
- తీవ్రంగా ఖండించిన బీజేపీ




**శనార్తి తెలంగాణ, ఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషిని నియమించడంపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో తప్పుబట్టారు. మంగళవారం పార్లమెంట్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జోషిని రేపిస్టుల మద్దతుదారుడిగ అభివర్ణిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయంపై విమర్శలు గుప్పించారు. బిల్కిస్ బానో కేసులో దోషుల విడుదలను గతంలో సమర్థించిన వ్యక్తికి కీలకమైన విద్యాశాఖను ఎలా అప్పగిస్తారని రాహుల్ నిలదీశారు. నేరస్తులను సమర్థించే వ్యక్తి కంటే నీచమైన వ్యక్తి మరొకరు ఉండరనీ.. ప్రహ్లాద్ జోషి నియామకం మన విద్యా వ్యవస్థకు, ప్రతి విద్యార్థికి అవమానకరమని అన్నారు. క్యాబినెట్‌లో ఇతర సమర్థులైన మంత్రులు ఉండగా, జోషినే ఎందుకు ఎంచుకున్నారో ప్రధాని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా సైతం లోక్‌సభలో ఇదే అంశాన్ని ప్రస్తావించారు. గర్భిణిపై అత్యాచారం చేసిన వారి విడుదలను సమర్థించిన వ్యక్తికి కీలక పదవి ఇవ్వడం ద్వారా దేశంలోని కోట్ల మంది విద్యార్థులకు ప్రధాని ఎటువంటి సందేశం పంపుతున్నారని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్ విమర్శలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. లోక్‌సభలో ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలు వ్యక్తిత్వ హననం కిందకు వస్తాయని ఆరోపించింది. ట్రెజరీ బెంచీల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవడంతో, స్పీకర్ ఓం బిర్లా ఆమె ప్రసంగంలోని కొన్ని భాగాలను సభ రికార్డుల నుంచి తొలగించారు.

# జూరాలకు పోటెత్తిన వరద.!

- ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల ఎత్తివేత.!
- ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు
- జూరాలకు 32,000 క్యూసెక్కులు ఇన్ ఫ్లో
- దిగువకు 30,700 క్యూసెక్కుల నీటిని దిగువలకు వదులుతున్న అధికారులు
- శ్రీ శైలంకు వచ్చి చేరుతున్న భారీ వరద



**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** రెండు తెలుగు రాష్ట్రాలపై "ఎల్ నినో" ప్రభావం అధికంగా ఉన్నప్పటికీ గత వారం రోజులుగా ఎగువ ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకి కృష్ణా జలాలు ఎట్టకేలకు తెలంగాణ సరిహద్దుల్లోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును తాకాయి. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 32,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా... అధికారులు క్రస్ట్ గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దాదాపు 30,700 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి ప్రవాహం నిలకడగా కొనసాగుతుండటంతో దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ వేగంగా చేరుతోంది. మహారాష్ట్ర, కర్ణాటకలోని పశ్చిమ కనుమలతో పాటు భీమా నది పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. భీమా నది ప్రవాహాలు కూడా తోడైతే జూరాలకు ఇన్‌ఫ్లోలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఎగువ నుంచి వచ్చే ప్రవాహం భారీగా పెరిగే సూచనలు కనిపించడంతో, రాబోయే రోజుల్లో శ్రీశైలానికి మరింత జలకళ రానుందని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీ శైలం ప్రాజెక్టు పూర్తి స్థాయిలోకి చేరితే దిగువన ఉన్న నాగార్జున సాగర్ కు నీటిని విడుదల చేయనున్నారు. దీంతో ఏపీ లోని ప్రాజెక్టులకు కూడా ఈ వరద నీరు చేరనుంది. ఈ కార్యక్రమంలో శ్రీ శైలం ప్రాజెక్టు ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాన్ని నీటిపారుదల శాఖ అధికారులు నిరంతరం గమనిస్తున్నారు. స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి హెచ్చరిస్తున్నారు. పరివాహక ప్రాంతాల్లోని రైతులలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



# జపాన్‌లో భారీ భూ కంపం

మొదటిపేజీ తరువాయి...

కూలడంతో పలువురు అందులోనే చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. దాదాపు 48 వేల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా, బుల్లెట్ రైళ్లు, స్థానిక రైలు సర్వీసులు, విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు. తొలుత తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరిక జారీ చేసిన అధికారులు, ప్రమాదం లేకపోవడంతో కొద్దిసేపటికే దానిని ఉపసంహరించుకున్నారు. అణు విద్యుత్ కేంద్రాల్లో సాధారణ పరిస్థితులే ఉన్నట్లు తెలిపిన ప్రభుత్వం, సహాయక చర్యల కోసం సైన్యాన్ని రంగంలోకి దించింది. మరో రెండు మూడు రోజుల పాటు బలమైన ఆఫ్టర్‌షాక్‌లు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జపాన్ వాతావరణ సంస్థ హెచ్చరించింది.



# అట్టుడుకుతున్న పీఓకే..!

## లాంగ్ మార్చిలో ఉద్రిక్తత

- చర్చలు విఫలమవడంతో జేఏఏసీ ఆందోళన
- నిరసనకారులపై భద్రతా బలగాల కాల్పులు..!
- 20 మంది మృతి, పలువురికి తీవ్ర గాయాలు
- "ఎక్స్" లో వివరాలు వెల్లడించిన జేఏఏసీ

**శనార్తి తెలంగాణ, ఢిల్లీ :** పాక్ ఆక్రమిత కశ్మీర్ లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 'జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ)' చేపట్టిన లాంగ్ మార్చ్ సందర్భంగా జరిగిన హింసలో కనీసం 20 మంది మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. జేఏఏసీ మంగళవారం ఎక్స్‌లో చేసిన పోస్టు చేసిన వివరాల ప్రకారం.. లాంగ్ మార్చ్ బృందాలు రావల్‌కోట్‌కు చేరుకున్నాయి. ఇప్పటివరకు 19 మంది మృతుల గుర్తింపును నిర్ధారించామని తెలిపింది. తలకు బుల్లెట్ గాయం అయిన మరో వ్యక్తి వద్ద గుర్తింపు పత్రాలు లేకపోవడంతో మొత్తం మృతుల సంఖ్య 20కి చేరిందని పేర్కొంది. పరిస్థితులు సాధారణమైన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామని తెలిపింది.
జేఏఏసీ, పాకిస్థాన్ అధికారుల మధ్య చర్చలు విఫలం కావడంతో ఈ లాంగ్ మార్చ్ చేపట్టారు. మీర్‌పూర్ డివిజన్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ ముజఫరాబాద్ వైపు సాగింది. ఆసమయంలో పాక్ భద్రతా బలగాలు శాంతియుత నిరసనకారులపై కాల్పులు, టియర్ గ్యాస్, భారీ బలప్రయోగానికి పాల్పడ్డాయని 'యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ' (యూకేపీఎన్‌పీ) ఆరోపించింది. దీంతో పలువురు మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారని పేర్కొంది. ఈ ఘటనపై ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు వెంటనే జోక్యం చేసుకోవాలని యూకేపీఎన్‌పీ కోరింది. శాంతియుత నిరసనకారులపై కాల్పులు, అధిక బలప్రయోగాన్ని నిలిపివేయాలని పాకిస్థాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది.

